సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

7

ఆదివారం । 6 । ఏప్రిల్ । 2025

భద్రాచలంలో జరిగే శ్రీరామనవమి వేడుకకు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా భక్తులు తరలివచ్చారు. అయితే పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ వసతి సౌకర్యాలు అందరికీ సరిపోకపోవడంతో పలువురికి కరకట్ట, గోదావరి తీరాలే పూలపాన్పులుగా మారాయి. దీంతో ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఖమ్మం



తొమ్మిదేళ్ల తర్వాత..

- సీతారాముల కల్యాణానికి ముఖ్యమంత్రి రాక
- సీఎం రేవంత్‌రెడ్డితోపాటు హాజరుకానున్న పలువురు మంత్రులు

భద్రాచలం: నేడు భద్రాచలంలో జరిగే సీతారాముల కల్యాణానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరుకానున్నారు. హైదరాబాద్ నుంచి హెలికాప్టర్ ద్వారా భద్రాచలం సమీపంలోని టోబాకో బోర్డు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో సారపాకలోని ఐటీసీ గెస్ట్‌హౌస్‌కు చేరుకుని పది నిమిషాలపాటు విశ్రాంతి తీసుకున్న తర్వాత శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయానికి చేరుకుంటారు. స్వామివారిని దర్శించుకుని మిథిలా స్టేడియానికి చేరుకుని కల్యాణ వేడుకల్లో భాగం అవుతారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీతారాములకు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించనున్నారు. కాగా 2016లో సీఎం హోదాలో చివరిసారిగా కేసీఆర్ ఈ సంప్రదాయం పాటించారు. ఆ తర్వాత వివిధ కారణాల వల్ల ఆయన హాజరుకాలేదు. మళ్లీ తొమ్మిదేళ్ల తర్వాత సీఎం హోదాలో పట్టువస్త్రాలు సమర్పించేందుకు రేవంత్‌రెడ్డి ఆదివారం వస్తున్నారు.

వీఐపీల తాకిడి

గతేడాది నవమి వేడుకల సమయంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో సీఎంతో సహ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలకు ప్రొటోకాల్ వర్తించలేదు. కొందరు ఎమ్మెల్యేలు సాధారణ భక్తుల్లాగే వేడుకలకు హాజరయ్యారు. కానీ, ఈసారి ఉత్సవాలకు వీఐపీల తాకిడి పెరిగింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డితోపాటు దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కూడా రానుండటంతో వీవీఐపీ, వీఐపీ గ్యాలరీలు కిక్కిరిసిపోనున్నాయి. ఈ నేపథ్యంలో ఉభయ దాతల కోటా కింద జారీ చేసే టికెట్లను కూడా తగ్గించారు.

జిల్లాకు మూడోసారి సీఎం

రేవంత్‌రెడ్డి సీఎం హోదాలో గతేడాది ఏప్రిల్‌లో భద్రాచలంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభానికి, ఆ తర్వాత కొత్తగూడెంలో పార్లమెంటు ఎన్నికల ప్రచార సభకు.. రెండుసార్లు వచ్చారు. దాదాపు ఏడాది తర్వాత జిల్లాకు మూడోసారి వస్తున్నారు. మధ్యాహ్న భోజనం తర్వాత రిజర్వ్ చేసిన 45 నిమిషాల వ్యవధిలో సీఎంను కలిసేందుకు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు ప్రయత్నిస్తున్నారు. కాగా భద్రాచలంలో మెరుగులు దిద్దిన ట్రైబల్ మ్యూజియంతోపాటు మాఢవీధుల విస్తరణ పనులను ప్రారంభిస్తారని ప్రచారం సాగినా సీఎం టూర్ షెడ్యూల్‌లో వీటి ప్రస్తావనలేదు. కాగా సారపాకలో ఓ గిరిజనుడి ఇంట్లో సీఎం మధ్యాహ్న భోజనం చేయనుండగా, సన్నబియ్యంతో వండిన అన్నం వడ్డించనున్నారు.

సీఎం పర్యటన షెడ్యూల్



సీఎం రేవంత్‌రెడ్డి

ఉదయం 8:45 గంటలకు బేగం పేట ఎయిర్‌పోర్టు నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరి ఉదయం 10 గంటలకు భద్రాచలం హెలిప్యాడ్‌కు, అక్కడి నుంచి రోడ్డు మార్గంలో సారపాకలోని ఐటీసీ గెస్ట్‌హౌస్‌కు చేరుకుంటారు. 10:10 నుంచి 10:30 గంటల వరకు రిజర్వ్ టైం కాగా, 10:30 గంటలకు గెస్ట్‌హౌస్ నుంచి బయల్దేరి 10:45 గంటలకు ఆలయానికి వస్తారు. 10:45 గంటల నుంచి 11:00 గంటల వరకు దర్శనం చేసుకుని, అనంతరం మిథిలా స్టేడియం చేరుకుంటారు, 11:10 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు కల్యాణ వేడుకలో పాల్గొంటారు. మధ్యాహ్నం 12:30 గంటలకు మిథిలా స్టేడియం నుంచి సారపాకకు బయల్దేరుతారు. 12:35 గంటల నుంచి మధ్యాహ్నం 1:10 గంటల వరకు సన్నబియ్యం లబ్ధిదారుడి ఇంట్లో భోజనం చేస్తారు. ఆ తర్వాత ఐటీసీ గెస్ట్‌హౌజ్ చేరుకోనుండగా, 1:15 నుంచి 2 గంటల వరకు రిజర్వ్ టైం. 2:15 గంటలకు హెలిప్యాడ్‌కు చేరుకుని హైదరాబాద్ బయల్దేరతారు.

సీతమ్మ అందాలు.. రామయ్య గోత్రాలు..!



ఎదుర్కోలు ఉత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

భక్తులను అలరించిన ఎదుర్కోలు ఉత్సవం



రామయ్య కల్యాణానికి తరలివస్తున్న భక్తులు

భద్రాచలం: శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవంలో కీలక ఘట్టమైన ఎదుర్కోలు ఉత్సవం శనివారం కనుల పండువగా జరిగింది. శ్రీరామనవమికి ముందు రోజు వారివంశాల విశిష్టతలను, గొప్పతనాన్ని వివరించే ఈ వేడుక ఆద్యంతం ఆసక్తిగా సాగింది. గరుత్మంతుని వాహనంపై స్వామివారిని మిథిలా స్టేడియం ఎదురుగా ఉన్న వైకుంఠ ద్వారం వద్దకు తీసుకొచ్చి కొలువుదీర్చారు. అనంతరం మా వంశం గొప్పదంటే ... కాదు మా వంశమే గొప్పదని చెబుతూ సీతమ్మ వారివైపు దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ బృందం, రామయ్య వారివైపు కమిషనర్ శ్రీధర్ బృందం చేరి వేడుక నిర్వహించారు. శ్రీ సీతారాముల వారి వైభవాన్ని లోకానికి తెలియజెప్పేందుకే ఎదుర్కోలు ఉత్సవ కార్యక్రమం జరిపినట్లు పండితులు తెలిపారు. హిందూ, ముస్లింల మత సామరస్యాన్ని పెంపొందించే విధంగా భక్తులందరికీ పన్నీరు చల్లారు. గోల్కొండ నవాబైన తానీషాను స్మరింపజేస్తూ భద్రాద్రి ఆలయంలో ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తూ వస్తున్నారు. ఆ తర్వాత ఊరేగింపుగా స్వామివారిని ఆలయానికి తీసుకెళ్లారు. కాగా దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ పట్టు వస్త్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ రమాదేవి, వేదపండితుడు గుదిమెళ్ల మురళీకృష్ణమాచార్యులు, ప్రధాన అర్చకులు విజయరాఘవన్, రామకోటి స్వరూప్, ఆలయ అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కనులారా తిలకించేలా ఏర్పాట్లు

భద్రాచలంటౌన్: శ్రీసీతారామచంద్ర స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని భక్తులు ప్రశాంత వాతావరణంలో కనులారా తిలకించేలా ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తెలిపారు. మిథిలా స్టేడియంలో శనివారం సెక్టార్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రామయ్య కల్యాణ వేడుక ప్రశాంతంగా జరగడానికి సెక్టార్ అధికారుల విధులు అత్యంత కీలకమని పేర్కొన్నారు. కల్యాణం అనంతరం మిథిలా స్టేడియంలో, పట్టణంలోని ప్రధాన కేంద్రాల్లో ప్రత్యేక కౌంటర్ల ద్వారా ఉచితంగా తలంబ్రాల పంపిణీ చేస్తామన్నారు. తాగునీరు, మజ్జిగ పంపిణీ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తామని తెలిపారు. టికెట్‌లేని వారిని కల్యాణ మండపంలోకి అనుమతిస్తే సెక్టార్ అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎండల దృష్ట్యా భక్తులకు ఉపశమనం కలగడానికి ప్రత్యేకంగా మిస్ట్ ఫాగర్స్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఐటీడీఏ పీఓ రాహుల్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఆర్డీఓ దామోదర్‌రావు పాల్గొన్నారు.

1,800 మందితో బందోబస్తు

భద్రాచలంఅర్బన్: ఉత్సవాలకు పోలీసు శాఖ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసింది. ఎస్పీ రోహిత్‌రాజు పర్యవేక్షణలో 1,800 మంది పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించనున్నారు. అదనపు ఎస్పీ, 16 మంది డీఎస్పీలు, 66 మంది సీఐలు, 186 ఎస్‌ఐలు, 859 మంది ఏఎస్‌ఐ/హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, 208 మహిళా కానిస్టేబుళ్లు, 414 మంది హోంగార్డులతోపాటు, ఆర్మ్‌డ్ రిజర్వుడు సిబ్బంది, బాంబ్ డిస్పోజబుల్ బృందాలతో పాటు 50 మంది సీఆర్పీఎఫ్ సిబ్బంది బందోబస్తులో పాల్గొనున్నారు. మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాలైన ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దు కలిగి ఉండటంతో భద్రాచలం చేరుకునే మార్గాల్లో ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు.

జగ్జీవన్‌రామ్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జీవితం స్ఫూర్తిదాయకమని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. కలెక్టరేట్‌లో శనివారం ఎస్సీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను నిర్వహించారు. మొదట కలెక్టర్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అత్యంత పేదరికంలో జన్మించిన బాబూజీ అకుంఠిత దీక్షతో అత్యున్నత స్థానానికి ఎదిగారని అన్నారు. కేంద్ర వ్యవసాయ మంత్రిగా హరిత విప్లవం విజయవంతంలో కీలకపాత్ర పోషించారని, అంటరానితనం, కుల వివక్ష నిర్మూలనకు పోరాడారని గుర్తుచేశారు. అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్, అధికారులు అనసూర్య, సంజీవరావు, రమాదేవి, భాస్కర్ పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



పెద్దమ్మతల్లి అమ్మవారిని దర్శించుకుంటున్న హైకోర్టు జడ్జి సూరేపల్లి నందా

పాల్వంచరూరల్: శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయాన్ని శనివారం హైకోర్టు న్యాయమూర్తి సూరేపల్లి నందా సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు ఆశీర్వచనం అందించారు. అనంతం ఈఓ రజనీకుమారి అమ్మవారి శేష వస్త్ర ప్రసాదాలను జడ్జికి అందజేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ బీఆర్ నాయుడు కూడా కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ట్రాఫిక్.. టెన్షన్!

ట్రాఫిక్ పరిష్కారానికి కసరత్తు

- ఏటా నవమికి భద్రాచలంలో రాకపోకలకు ఇక్కట్లు
- ఈసారి ముందస్తు కార్యాచరణగా ప్రత్యేక పార్కింగ్ స్థలాలు

భద్రాచలంఅర్బన్: భద్రాచలంలో శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యాన నిర్వహించే బ్రహ్మోత్సవాల్లో అత్యంత కీలక ఘట్టమైన శ్రీరామ నవమినే. శ్రీ సీతారామచంద్రస్వామి వారి కల్యాణాన్ని తిలకించి తిరిగి భక్తులు తమ గమ్యస్థానాలకు వెళ్లే సమయంలో ఏటా తిప్పలు తప్పడం లేదు. ప్రతీ సంవత్సరం అధికార యంత్రాంగం సమీక్షలైతే నిర్వహిస్తోంది కాని దీనికి పూర్తిస్థాయి పరిష్కారాన్ని కనుగొనలేకపోతోందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా పదేళ్లుగా నత్తనతకగా సాగుతున్న రెండో వంతెనను రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవతో గతేడాది అప్పటి కలెక్టర్ ప్రియాంక ఆల ప్రారంభించారు. దీని కారణంగా గతేడాది ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ జామ్ కొంత మేర తగ్గినా, స్వామి వారి కల్యాణం కోసం వచ్చే భక్తగణంతో భద్రాద్రి పట్టణం కిక్కిరిసిపోతోంది.



ఇంటికే రామయ్య తలంబ్రాలు..

రామయ్య తలంబ్రాలను ఆర్టీసీ కార్గో ద్వారా ఇంటి వద్దకే చేరవేస్తారు. ఇందుకోసం రూ.151 చెల్లించాల్సి ఉండగా, పోస్టల్ శాఖలో రూ.150 చెల్లించి బుక్ చేసుకోవచ్చు. ఈ నెల 6 వరకు బుకింగ్ చేసుకోవచ్చని సంబంధిత అధికారులు తెలిపారు.

ఆకాశాన్నంటుతున్న వసతి గదుల రేట్లు..

రాముల వారి కల్యాణం సందర్భంగా భద్రాచలం పట్టణంలో ఉన్న ప్రైవేట్ వసతి గదుల రేట్లు ఆకాశాన్ని అంటుతున్నాయి. భద్రాచలంలో సుమారు 70 లాడ్జీలు ఉండగా.. వీటిల్లో 695 రూములను కేటగిరీలుగా విభజించి 50 శాతం రెవెన్యూ శాఖ అధికారులకు, 25 శాతం పోలీస్ శాఖకు, మిగిలిన 25 శాతం ప్రైవేట్ లాడ్జీలకు కేటాయించారు. సాధారణ రోజుల్లో ఒక లాడ్జీ రూ.2,500 ఉంటే ఇప్పుడు రూ.25వేల వరకు పలుకుతున్నట్లు సమాచారం.

‘ఎర్త్ సైన్సెస్’కు సీఎం ఆమోదం

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలో ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయాన్ని మంజూరు చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం ఆమోదం తెలిపారు. మైనింగ్ కళాశాలను అప్ గ్రేడ్ చేస్తూ యూనివర్సిటీగా మారుస్తున్నట్లు ప్రకటించారు. దేశంలోనే మొట్టమొదటిది కావడంతోపాటు సహజ వనరులు, మినరల్స్ ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయం ఏర్పాటుతో అంతర్జాతీయ ఖ్యాతి లభించనుంది. కాగా సహజ వనరులు, మెరుగైన అవకాశాలు ఉన్న మైనింగ్ కళాశాలను ఎర్త్ సైన్సెస్ విశ్వ విద్యాలయంగా అప్ గ్రేడ్ చేయాలని మంత్రి తుమ్మల చొరవ చూపి పలుమార్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి విన్నవించారు.

అద్భుతంగా వెదురు ఉత్పత్తులు..

చంద్రుగొండ : వెదురు ఉత్పత్తుల తయారీ అద్భుతంగా ఉందని నీతి ఆయోగ్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ దేవిప్రసాద్ అన్నారు. మండలంలోని బెండాలపాడు గ్రామశివారులో ఉన్న బ్యాంబో క్లస్టర్‌ను శనివారం ఆయన సందర్శించారు. వెదురు ఉత్పత్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వెదురు ఉత్పత్తుల తయారీదారులకు సాంకేతికత జోడించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం వెదురు నర్సరీని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ విద్యాచందన, ఎంపీడీఓ బయ్యారపు అశోక్, సెక్రటరీ రోహిత్, క్లస్టర్ చైర్మెన్ ఈసం నాగభూషణం, డైరెక్టర్లు మల్లం కృష్ణయ్య, బొర్రా సురేష్, వర్సా శ్రీను, పద్దం రమేష్, రవి, సైదులు పాల్గొన్నారు.

గిరిజనుడి ఇంట సీఎంకు భోజనం

- ప్రభుత్వం అందించే సన్నబియ్యంతో..
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ జితేష్ వి పాటిల్



శ్రీనివాస్ ఇంటిని పరిశీలిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

బూర్గంపాడు: భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామి కల్యాణం అనంతరం సారపాకకు చెందిన గిరిజనుడు బూరం శ్రీనివాస్ ఇంట్లో సీఎం రేవంత్‌రెడ్డితో పాటు రాష్ట్ర మంత్రులు ఆదివారం భోజనం చేయనున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సన్న బియ్యంతో పేదల ఇంట్లో భోజనం చేసి లబ్ధిదారులతో మాట్లాడాలనే ఉద్దేశంతో సీఎం ఈ నిర్ణయం తీసుకున్నారు. దీనికి సంబంధించి సీఎంఓ నుంచి శనివారం టూర్ షెడ్యూల్ కూడా విడుదలైంది. కాగా, శ్రీనివాస్ ఇంటిని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఇతర అధికారులు శనివారం పరిశీలించి ఆయన కుటుంబసభ్యులతో మాట్లాడారు. ప్రభుత్వం అందించిన సన్నబియ్యంతోనే అన్నం వండి పప్పు, చారు, కూర, పచ్చడితో భోజనం వడ్డిస్తామని శ్రీనివాస్ తెలిపారు. ఈనేపథ్యాన పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా, నాయకపోడు తెగకు చెందిన గిరిజనుడి ఇంట భోజనానికి సీఎం రావడం సంతోషకరమని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం గిరిజనుడి ఇంటికి వెళ్లి వారితో మాట్లాడారు.